క్లుప్తంగా

దివ్యాంగుల నిర్ధారణ వైద్య శిబిరం



దివ్యాంగులను గుర్తిస్తున్న వైద్యురాలు

ఉంగుటూరు: దివ్యాంగులకు ఉపకరణాలు అందజేసే ప్రక్రియలో భాగంగా దివ్యాంగులను గుర్తించే వైద శిబిరం నారాయణపురం జిల్లా పరిషత్ హైస్కూల్లో గురువారం నిర్వహించారు. వైద్య శిబిరంలో దివ్యాంగులతోపాటు తల్లిదండ్రులు హాజరయ్యారు. కార్యక్రమంలో అడిషనల్ ప్రాజెక్టు అధికారి బి.సోమశేఖర్, మార్గదర్శకత్వంలో జిల్లా సమగ్ర శిక్ష విలీన విద్యా సమన్వయకర్త బొర్రా భాస్కరరాజు మాట్లాడుతూ 5 మండలాల్లో దివ్యాంగుల భవిత కేంద్రాలలో చదువుతోన్న విద్యార్థులకు సమగ్ర శిక్ష ద్వారా ఉపకరణాలు పంపిణీ చేస్తారని వివరించారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తాడేపల్లిగూడెం ఉప విద్యాశాఖాధికారి నిమ్మగడ్డ రవీంద్ర భారతి, నారాయణపురం సర్పంచి దిడ్ల అలకనంద, ఉంగుటూరు ఎంఈవో కె.శ్రీనివాసరావు, హెచ్ఎం మీరా సాహెబ్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలు తక్షణం పరిష్కరించాలి

దెందులూరు: గ్రామాల్లో నెలకొని ఉన్న ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సూచించారు. గురువారం ఎమ్మెల్యే కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. జెడ్పీ సీఈఓ కే.సుబ్బారావు, డీపీఓ తూతిక శ్రీనివాస విశ్వనాథ్, టీడీపీ మండల అధ్యక్షుడు మాగంటి నారాయణ ప్రసాద్ (మిల్లుబాబు), బొప్పన సుధాకర్, నంబూరి నాగరాజు పాల్గొన్నారు.

మెరుగైన చికిత్స అందించాలి

ఏలూరు టౌన్: తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల సమీపంలో జాతీయ రహదారిపై ఆర్టీసీ బస్సు, బొలేరో వాహనం ఢీకొని పలువురు గాయాలపాలయ్యారు. దెందులూరు మండలం గాలాయగూడెం గ్రామానికి చెందిన కూచిపూడి అర్జున్, ఉప్పాటి శ్యామ్‌బాబు అనే ఇద్దరు యువకులు తీవ్ర గాయాలపాలయ్యారు. ఘటనా స్థలానికి చేరుకున్న నల్లజర్ల ఎస్సై దుర్గాప్రసాద్ క్షతగాత్రులను ఏలూరు జీజీహెచ్‌కు తరలించారు. జీజీహెచ్‌లో బాధితులను ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పరామర్శించారు.

వైద్య శిబిరం పోస్టర్ల ఆవిష్కరణ



దివ్యాంగుల నిర్ధారణ వైద్య శిబిరాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు

దెందులూరు: ప్రభుత్వం దివ్యాంగులకు అవసరమయ్యే ఉపకరణాలను అందించేందుకు నిర్ధారణ వైద్యశిబిరాలు నిర్వహిస్తోందని ఈ అవకాశాన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని దెందులూరు మండల విద్యాశాఖాధికారులు ఏవీఎస్‌వీ ప్రసాద్, కె.అన్నమ్మ అన్నారు. గురువారం దెందులూరు ఎంఈఓ కార్యాలయంలో దివ్యాంగుల నిర్ధారణ వైద్య శిబిరాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ నెల 29న దెందులూరు గారపాటి హైమావతిదేవి జిల్లా పరిషత్ హైస్కూల్లో వైద్యశిబిరం జరుగుతుందని ఎంఈఓలు తెలిపారు. కార్యక్రమంలో ఐఆర్‌టీ టీచర్లు హేమలత, శ్రీదేవి పాల్గొన్నారు.

కొనసాగుతున్న పోలీస్ పికెట్



కైకరంలో పహారా కాస్తున్న పోలీసులు

ఉంగుటూరు: కై కరం గ్రామంలో పట్టపగలే ముగ్గురు నాయకుల ఇళ్ల మీదకు గ్రామంలోని టీడీపీ నాయకుడి వర్గం యువకులు కొందరు దౌర్జన్యంగా దాడికి పాల్పడి అలజడి సృష్టించారు. ఈ కేసులో ఇంతవరకు ఎవరిని పోలీసులు అరెస్ట్ చేయలేదు. గ్రామంలో 5 వ రోజు 5 గుళ్ల సెంటర్లో పోలీస్ పికెట్ కొనసాగింది. ఈ కేసు వ్యవహారం తాత్సారం చేస్తునట్లు తెలుస్తోంది. కొందరు యువకులును పిలిచి విచారించి, 41 నోటీసు ఇచ్చి హెచ్చరించినట్లు సీఐ సుభాష్ తెలిపారు.

ఢిల్లీ హైకోర్టు తీర్పు హర్షణీయం

దెందులూరు: రాష్ట్రంలో నిలిచిపోయిన టీవీ 9, ఎన్‌టీవీ, 10 టీవీ , సాక్షి టీవీ ప్రసారాలు పునరుద్ధరించాలని ఢిల్లీ హైకోర్టు తీర్పు హర్షణీయమని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు తేరా ఆనంద్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రజాస్వామ్యంలో పత్రికా స్వేచ్ఛను ఎవరైనా గౌరవించాలని పేర్కొన్నారు. ప్రసార సాధనాలు ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉంటాయని ఏమైనా సమస్యలుంటే సమస్యల దిశగా పయనించాలే తప్ప కక్షపూరిత చర్యలకు దిగకూడదని హితవు పలికారు

వలంటీర్ల సేవలకు మంగళం

- ఇప్పటికే పేపర్ బిల్లు భత్యం రూ.200 నిలిపివేత
- పింఛన్ల పంపిణీ బాధ్యతలకూ దూరం
- జూలై 1 నుంచి సచివాలయ ఉద్యోగుల ద్వారా పంపిణీ
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- రోడ్డున పడనున్న 1,466 మంది వలంటీర్లు

నిడమర్రు: తాము అధికారంలోకి వస్తే వలంటీరు వ్యవస్థను కొనసాగించడంతో పాటు వారికి ఇచ్చే గౌరవ వేతనం రూ.5 వేలు నుంచి రూ.10 వేలకు పెంచుతామని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు స్పష్టమైన హామీ ఇచ్చారు. ఆ పార్టీ మేనిఫెస్టోలోనూ దీనిని పొందుపరిచారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం చంద్రబాబు వలంటీర్ల ఊసెత్తకపోగా వారిని విధులకు దూరంగా ఉంచారు. తాజాగా గత ప్రభుత్వం ఇస్తున్న పేపర్ బిల్లు భత్యం నిలిపివేయడంతోపాటు పెన్షన్ల పంపిణీ బాధ్యతను కూడా సచివాలయ ఉద్యోగులకే అప్పగించడంతో వలంటీరు వ్యవస్థ కొనసాగింపుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో ఉంగుటూరు నియోజకవర్గంలో వలంటీర్లుగా సేవలందిస్తున్న 1466 మంది వారి భవిష్యత్ అగమ్యగోచరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పారదర్శక సేవల కోసం సచివాలయాలు

ప్రజలకు పారదర్శకంగా మెరుగైన సేవలు అందించాలని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. దీనికి అనుబంధంగా వలంటీరు వ్యవస్థను ప్రవేశపెట్టింది. ఈ వ్యవస్థ ద్వారా ప్రజల ఇళ్ల వద్దే అవసరమైన సేవలు అందేలా చర్యలు తీసుకుంది. ఉంగుటూరు నియోజకవర్గంలో 50 ఇళ్లకు ఒక వలంటీరును అధికారులు నియమించారు. వీరు గత ఐదేళ్లగా ప్రభుత్వ పథకాలు, సేవలను వారికి కేటాయించిన ఇంటింటికి వెళ్లి అందించారు. ప్రతీ నెల 1వ తేదీ ఉదయాన్నే వృద్ధులు, వితంతువులు, దివ్యాంగుల ఇళ్లకు వెళ్లి పింఛన్ పంపిణీ చేసి వారి మన్ననలు అందుకున్నారు. ఈ వ్యవస్థను ముందు నుంచి వ్యతిరేకిస్తున్న టీడీపీ ఎన్నికల ముందు మాత్రం వలంటీరు వ్యవస్థను కొనసాగించడమే కాకుండా వారికి ఇచ్చే గౌరవ వేతనం రెట్టింపు చేస్తానని ప్రతీ సభలో వలంటీర్లకు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రం వలంటీర్లకు ఎలాంటి బాధ్యతలు అప్పగించకుండా వారిని ఇళ్లకు పరిమితం చేయడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



బువ్వనపల్లి సచివాలయం



బువ్వనపల్లిలో కిడ్నీ బాధితురాలికి మంచం మీద ఉండగానే నెలవారీ పింఛన్ నగదు అందిస్తున్న వలంటీరు (ఫైల్)

నిడమర్రులో 6430 మందికి ఇంటి వద్దే పంపిణీ

మండలం	వలంటీర్ల సంఖ్య
ఉంగుటూరు	476
నిడమర్రు	243
గణపవరం	393
భీమడోలు	354

అవ్వా తాతలకు, ఒంటరి మహిళలకు, వితంతువులకు, కిడ్నీ బాధితులకు సామాజిక భద్రత కల్పించేందుకు అందించే పెన్షన్ల పంపిణీ ఒకటో తేదీ ఉదయం 8 గంటల లోపు 90 శాతం పూర్తయ్యేది. ప్రతీ నెల నిడమర్రు మండలంలో 16 గ్రామాల్లో 6430 మంది వివిధ రకాల పెన్షన్ లబ్ధిదారులు ఉన్నారు. వీరిలో 3,524 మంది వృద్ధాప్య, 1330 మంది వితంతు, 768 మంది దివ్యాంగ, 367 మంది మత్స్యకార, 441 మంది కల్లుగీత, కిడ్నీ వ్యాధిగ్రస్తుల పెన్షన్ లబ్ధిదారులు ఉన్నారు. వీరందరికీ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చే వరకూ మండలంలోని 243 మంది గ్రామ వలంటీర్లు లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పంపిణీ పూర్తి చేసేవారు. ప్రస్తుత ప్రభుత్వం ఆయా గ్రామాల్లోని సచివాలయ సిబ్బందితో పింఛన్ పంపిణీ నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తుంది.

వలంటీర్లకు న్యాయం చేయాలి



గ్రామ, వార్డు వలంటీర్లుగా కొనసాగుతున్న యువతకు ప్రభుత్వం తగిన న్యాయం చేయాలి. సేవా దృక్పథంతో ఉన్న వారందరికి తగిన గుర్తింపు ఇవ్వాలి. ఎన్నికల్లో ఇచ్చిన గౌరవ వేతనం పెంపు హామీ రూ.5వేలు నుంచి రూ.10 వేలకు పెంచేలా కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టాలి. రాజీనామాలు చేయకుండా ప్రస్తుతం అందుబాటులో ఉన్న వలంటీర్ల సేవలు వినియోగించుకోవాలి.

– పుప్పాల మెహర్‌కుమార్, ఉపాధ్యక్షుడు జిల్లా సర్పంచ్‌ల సంఘం

సచివాలయ ఉద్యోగుల ద్వారా పంపిణీ

ఈ నెల సామాజిక భద్రత పింఛన్లు పంపిణీ ఆయా గ్రామాల్లోని గ్రామ సచివాలయ ఉద్యోగుల ద్వారా పంపిణీ చెయ్యాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయి. మండలంలో 6430 మంది లబ్ధిదారులకు వారి ఇంటి వద్దే పింఛన్లు పంపిణీ జరిగేలా కృషి చేస్తాం.

– జి.శివ రామకృష్ణయ్య, ఎంపీడీవో, నిడమర్రు

మరణ ధ్రువీకరణ పత్రాలు, ఫ్యామిలీ సర్టిఫికెట్లు ఇవ్వాలి

దెందులూరు: దోసపాడు గ్రామంలో చనిపోయిన పేదలకు మరణ ధ్రువీకరణ పత్రాలు, ఫ్యామిలీ సర్టిఫికెట్లు వెంటనే ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ కోరారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దోసపాడు పేదలకు జిల్లా జాయింట్ కలెక్టర్ కోర్టు ఇచ్చిన జడ్జిమెంట్‌ను వెంటనే అమలు చేయాలని అసైన్‌మెంట్, సీలింగ్ భూములను పేదలకు పంచాలని, పట్టాలు, పాసుపుస్తకాలు ఇవ్వాలని ఎంతో కాలంగా ఆందోళనలు, పోరాటాలు చేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఎట్టకేలకు జిల్లా జాయింట్ కలెక్టర్, కోర్టు అసలైన అసైన్డ్‌దారులకు పట్టాలు, పాసుపుస్తకాలు ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చారని తాత్సారం చేయకుండా మండల రెవెన్యూ అధికారులు పట్టాలు, పాసుపుస్తకాలు ఇవ్వాలని, మరణించిన వారికి మరణ ధ్రువీకరణపత్రాలు, ఫ్యామిలీ సర్టిఫికెట్లు ఇవ్వాలని కోరారు. ఈ మేరకు దెందులూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద డిప్యూటీ తహసీల్దార్ ప్రియదర్శినికి వినతి పత్రం అందజేశారు.



దెందులూరు డిప్యూటీ తహసీల్దార్ ప్రియదర్శినికి వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

కలుపు నివారణకు సాయిల్ మల్చింగ్



వివిధ గ్రామాల్లో సాయిల్ మల్చింగ్ చేస్తున్న దృశ్యం

నియోజకవర్గంలో వివిధ గ్రామాల్లో ఉద్యాన పంటలైన బొప్పాయి, మిర్చి, ఇతర పంటలకు కలుపును నివారించేందుకు రైతాంగం సాయిల్ మల్చింగ్ విధానాన్ని అవలంభిస్తున్నారు. వ్యవసాయ శాఖాధికారుల సూచనలు, సలహాలు పాటిస్తూ ఈ విధానాన్ని అవలంభిస్తున్నారు. కలుపు నివారించే దిశగా సత్ఫలితాలు లభిస్తున్నాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. - దెందులూరు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

భీమడోలు: సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని భీమడోలు ఈవోపీఆర్డీ కె.సుందరి అన్నారు. డీపీవో ఆదేశాల మేరకు గురువారం మండల వ్యాప్తంగా నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణ తీరు, అంగన్‌వాడీ, ప్రభుత్వ పాఠశాలల్లోని చిన్నారుల ఆరోగ్య సమస్యలు, గ్రామాల్లో నీటి నాణ్యత పరీక్షలు, డ్రైనేజ్‌లో పైపులైన్ మరమ్మతులు వంటి పనులను ఆమె పరిశీలించారు. కొల్లేరు గ్రామాలైన ఆగడాలలంక, చెట్టున్నపాడు, మల్లవరంలో ఆమె పర్యటించారు. ఓహెచ్ఎస్ఆర్‌లో నీటి క్లోరినేషన్ నిర్వహణ తీరును పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను సందర్శించి చిన్నారుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులలైన మలేరియా, డెంగ్యూ, డయేరియా వంటి ప్రాణాంతక వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలన్నారు. పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద విధిగా శానిటేషన్ చేయించాలన్నారు. చిన్నారులకు తినక ముందు, తిన్నా తర్వాత తప్పనిసరిగా చేతులు శుభ్రం చేసుకునే అలవాటు చేయాలన్నారు. చిన్నారులకు క్లోరినేషన్ కలిగిన తాగునీటిని అందించాలన్నారు. గ్రామ కార్యదర్శులు మురళీ, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



క్లోరినేషన్ విధానాన్ని పరిశీలిస్తున్న ఈవోపీఆర్డీ కె.సుందరి

త్వరలో గుడివాకలంకలో సర్పంచ్ ఎన్నిక !

ఏలూరు రూరల్ : త్వరలో కొల్లేరు గ్రామం గుడివాకలంకలో సర్పంచ్ ఎన్నిక నిర్వహించనున్నట్టు గురువారం గ్రామ పెద్దలు ప్రకటించారు. ఇదేంటి సర్పంచ్ ఎన్నికలు అధికారులు నిర్వహించాలి కదా అనుకుంటున్నారా. ఇక్కడంతే.. కొల్లేరు కట్టుబాట్లు పేరుతో గ్రామ పెద్దలే సర్పంచ్ ఎన్నిక నిర్వహిస్తారు. అయితే ఇవి అనధికార ఎన్నికలు. కాని గెలిచిన వ్యక్తి సర్పంచ్‌లా వ్యవహరిస్తూ అధికారాలు చలాయిస్తాడు. ఆశ్చర్యంగా ఉంది కదూ. వివరాల్లోకి వెళితే.. 2021లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో గ్రామ పెద్దలు, బంటా పెద్దలు వైఎస్సార్ సీపీ నాయకుడు జయమంగళ రామారావు భార్య ప్రభావతిని బలపరిచారు. ఫలితంగా ఆమె సర్పంచ్‌గా గెలుపొందారు. అయితే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించడంతో ఆమె జిల్లా పంచాయతీ అధికారులను కలిసి తన సర్పంచ్ పదవికి రాజీనామ పత్రం అందజేశారు. ఆమె రాజీనామను ప్రభుత్వం ఇంకా ఆమోదించలేదు. ఈలోగా గ్రామంలో కొందరు పచ్చనేతలు గ్రామంపై పట్టు సాధించేందుకు అనధికార సర్పంచ్ ఎన్నిక నిర్వహించాలని పెద్దలను డిమాండ్ చేశారు. దీంతో పెద్దలు గురువారం గ్రామసభ నిర్వహించారు. టీడీపీ గ్రామ నాయకులు ఘంటసాల నాగరాజు, జయమంగళ దొరబాబు సర్పంచ్ పదవికి పోటీపడ్డారు. దీంతో పెద్దలు త్వరలో ఎన్నిక నిర్వహిస్తామని ప్రకటించి సమావేశాన్ని ముగించారు. కొల్లేరు గ్రామాల్లో ప్రభుత్వం నిర్వహించే సర్పంచ్ ఎన్నికలకు ముందు గ్రామ పెద్దలు ప్రజల కలిసి ఏకగ్రీవంగా ఒక వ్యక్తిని ఎన్నుకుంటారు. తర్వాత ఆ వ్యక్తి మాత్రమే నామినేషన్ వేస్తాడు. సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికౌతాడు. కొల్లేరు గ్రామాల్లో కొన్నేళ్లుగా ఇదే తంతు కొనసాగుతోంది. ఒకవేళ ఎవరైనా నామినేషన్ వేస్తే, ప్రజలు అందరూ కలిసి బలపరిచిన వ్యక్తినే భారీ మెజారిటీతో ఎన్నుకుంటారు.

దాతల సహకారం అభినందనీయం

భీమడోలు: పేద విద్యార్థులను ఆదుకోవడంలో దాతల సహకారం మరవలేనిదని పలువురు వక్తలు అన్నారు. సూరప్పగూడెం పంచాయతీ పరిధిలోని పాతూరు ప్రాథమిక పాఠశాలలో గురువారం గ్రామానికి చెందిన రిటైర్డ్ హెచ్ఎం స్వర్గీయ పల్లా ఆదినారాయణ కుమారుడు రాజమండ్రికి చెందిన ప్రముఖ న్యాయవాది, దాత పల్లా త్రినాథరావు ఆర్థిక సాయంతో విద్యార్థినీ విద్యార్థులకు రూ.15 వేల విలువ చేసే రాత పుస్తకాలు, అభ్యసన సామాగ్రిని బహూకరించారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ మాట్లాడుతూ ఎంతో విలువైన నీతి కథల పుస్తకాలు, రాత పుస్తకాలను చిన్నారులకు అందించిన దాత సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం పి.నిర్మలకుమారి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ షేక్ బీబీ, పెద్దలు షేక్ భాషా, వెజ్జు రాంబాబు, అంగన్‌వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులతో దాత పల్లా త్రినాథరావు, ఉపాధ్యాయులు

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

నిడమర్రు: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని నిడమర్రు ఎంఈవో కె.రాంబాబు అన్నా రు. గురువారం మండలంలోని పెదనిండ్రకొలను వెలంపేట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు దాతల సహకారంతో రూ.6వేల విలువైన నోటు పుస్తకాలు, ఇతర విద్యాసామాగ్రిని ఎంఈవో పంపిణీ చేశారు. కార్యక్రమంలో దాత దంగేటి వెంకటనారాయణ, పంచాయతీ సభ్యుడు చినిమిల్లి రాంబాబు, హెచ్ఎం రాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు నోటుపుస్తకాలు అందిస్తున్న ఎంఈవో రాంబాబు

విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి



తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న మండల విద్యాశాఖాధికారి సబ్బితి నర్సింహమూర్తి

పెదపాడు : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని పెదపాడు మండల విద్యాశాఖాధికారి సబ్బితి నర్సింహమూర్తి తెలిపారు. పెదపాడు మండలంలోని కొత్తముప్పర్రు గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు. పాఠశాలలో విద్యార్థుల ప్రవేశాలు తక్కువగా ఉండడంతో పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి ఇద్దరు విద్యార్థులను చేర్పించామన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు వైఎస్‌వీ పద్మ పాల్గొన్నారు.

అండర్‌పాస్‌లోకి నీరు చేరడంతో ఇబ్బందులు

దెందులూరు: దెందులూరు– అలుగులగూడెం రైల్వే క్రాసింగ్ గేటు వద్ద నిర్మించిన అండర్ పాసులోకి మళ్లీ వర్షపు నీరు చేరింది. ఈ అండర్‌పాసు మీదుగా దెందులూరు, పెదవేగి, ఏలూరు మండలాల ప్రజల ప్రయాణికులు, విద్యార్థులు అనునిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. అండర్‌పాస్ వంతెన పైన ఏదైనా రక్షణ మార్గం ఏర్పాటు చేస్తే వర్షపు నీరు అండర్‌పాసులోకి రాకుండా ఉంటుందని అలా రక్షణ చర్యలు చేయకపోవడం వల్ల కొద్దిపాటి వర్షం వచ్చినా అండర్‌పాసులోకి నీరు చేరి తీవ్ర అసౌకర్యం కలుగుతుందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైల్వే ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని వర్షం వచ్చినప్పుడు నీరు తోడించడమే కాకుండా మూడు మండలాల ప్రజలు ప్రయాణాలను దృష్టిలో పెట్టుకుని శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.



దెందులూరు- అలుగులగూడెం అండర్‌పాస్‌లో మళ్లీ నీరు చేరిన దృశ్యం

రహదారులు అధ్వానం



భీమడోలు జంక్షన్ నుంచి రైల్వే గేటు వరకు ఛిద్రమయిన రహదారి

భీమడోలు: అల్పపీడన ద్రోణి ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు రోడ్లు అధ్వానంగా మారాయి. గోతుల మయంగా మారిన రోడ్లపై రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు అదుపుతప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు. దీనితో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భీమడోలు జంక్షన్ నుంచి రైల్వే గేటు వరకు, రాజుల వీధిలోని రోడ్లు, జంక్షన్‌లోని కూడలి ప్రాంతం అడుగుడుగునా గోతులతో నిండాయి. వేసవిలో రోడ్డుకు మరమ్మతులు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించినా సంబంధిత అధికారులు మాత్రం గోతులను పూడ్చిన పాపాన పోలేదు. ద్వారకాతిరుమల వేంకటేశ్వరుని దర్శించుకునేందుకు వెళ్లే భక్తులకు ఇదే ప్రధాన మార్గం కావడంతో ఈ గోతులతో నిండిన రోడ్లపై ప్రయాణించాలంటేనే హడలెత్తిపోతున్నారు. ఇకనైనా ఆర్అండ్‌బీ అధికారులు తాత్కాలికంగా మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఛటర్జీ సేవలు చిరస్మరణీయం



భీమడోలు లైబ్రరీలో ఛటర్జీ సేవలను చిన్నారులకు వివరిస్తున్న మండే సుధాకర్

భీమడోలు: స్వాతంత్య్ర సమరంలో బెంగాలీ కవి బకించంద్ర ఛటోపాధ్యాయ (ఛటర్జీ) చేసిన సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు చెప్పారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో గురువారం సాయంత్రం గ్రంథ పాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో వందేమాతర గీతం రచయిత బకించంద్ర ఛటర్జీ 186వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు, పాఠకులు ఆయనను స్మరించుకొని, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వందేమాతర గేయాన్ని వారంతా ఆలపించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ మాట్లాడుతూ ఛటర్జీ సేవలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాది పి.సంపదరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఖర్చులు, పన్నుల వసూళ్లపై సమాచారం ఇవ్వాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): కోవిడ్ సమయంలో ఏలూరు నగరపాలక సంస్థ పెట్టిన ఖర్చులు, గత ఐదేళ్లలో సంస్థ పన్నుల రూపంలో వసూలు చేసిన మొత్తం తాలూకా వివరాలు సమర్పించాలని సమాచార హక్కు చట్టం ప్రకారం కోరుతూ నగర కమిషనర్‌కు దరఖాస్తు చేసినట్టు హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ ఫక్షరం చైర్మన్ గంటా స్వామి తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు.

మంచినీటి నాణ్యత పరీక్షలు

గణపవరం: మారుతున్న వాతావరణ పరిస్థితులు, వర్షాల కారణంగా నీటి వనరులు కలుషితమై డయేరియా ప్రబలుతున్న పరిస్థితులలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు త్రాగే మంచినీటికి నాణ్యత పరీక్షలు నిర్వహించారు. గణపవరం, నిడమర్రు మండలాలలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో గురువారం త్రాగునీటి పరీక్షలు నిర్వహించారు. పంచాయతీ కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్న నీటిని క్లోరినేషన్ చేసి, ఫిల్టర్ చేసిన తర్వాతే సరఫరా చేయాలని అధికారులు సూచించారు. ఆయా పాఠశాలల్లో వాటర్ ట్యాంకులు ప్రతీ వారం శుభ్రం చేయించాలని, విద్యార్థులు మంచి నీరు తాగే ప్రదేశం పరిశుభ్రంగా ఉంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్స్, సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది మంచినీటి పరీక్షలు నిర్వహిస్తున్నారు.



బువ్వనపల్లి యూపీ పాఠశాలలో మంచినీటిని పరీక్షిస్తున్న అధికారులు

అమరుల ఆశయాలను సాధిద్దాం

ఏలూరు (టూటౌన్): కమ్యూనిస్టు ఉద్యమంలో పని చేస్తూ అమరులైన వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే వారికిచ్చే ఘనమైన నివాళి అని సీపీఎం ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్ అన్నారు. స్థానిక చేపల తూము సెంటర్, మున్సిపల్ మార్కెట్ వద్ద సీపీఎం అమరజీవుల వర్ధంతి సభ గురువారం నిర్వహించారు. అమర జీవుల చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. సీపీఎం ఏలూరు మాజీ కార్యదర్శిగా, మాజీ కౌన్సిలర్‌గా పనిచేసిన లావేటి అప్పలస్వామి ప్రజలకు నిస్వార్థంగా సేవలు అందించారని గుర్తుచేశారు.

ఉచిత వైద్య శిబిరం



వైద్య శిబిరంలో వృద్ధులను పరీక్షిస్తున్న డాక్టర్ శిరీష

ఉంగుటూరు: ఉంగుటూరు ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి వద్ద వృద్ధులకు ఉచిత వైద్య శిబిరం గురువారం నిర్వహించారు. డాక్టర్ కస్తూరి శిరీష వృద్ధులకు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం మందులు అందజేశారు. కీళ్ళ సమస్యలు, అజీర్ణం, నిద్రలేమి సమస్యలకు తగిన ఆయుర్వేద మందులు పంపిణీ చేసి సూచనలు, సలహాలు అందజేశారు. ఆసుపత్రి సహాయకురాలు కృష్ణకుమారి, సామాజిక కార్యకర్త తల్లాప్రగడ భీమేశ్వరరావులు సహకరించారు. శిబిరంలో 96 మంది ఆరోగ్య సేవలు పొందారు.

ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో 330 సీట్లు ఖాళీ

దెందులూరు: మండలంలోని కొవ్వలి గ్రామంలో ఉన్న నియోజకవర్గ స్థాయి ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో 330 సీట్లు ఖాళీగా ఉన్నాయని హాస్టల్ ఏడ సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో 5 నుంచి 10వ తరగతి విద్యార్థులకు వసతి సౌకర్యం ఉంటుందన్నారు. నియోజకవర్గంలో విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏడ కోరారు.